# చిన్నల్లుడా జిందాబాద్

"నేను మీ పెద్దకొడుకుని, ముందుగా నాదగ్గరకు రావడమే సమంజసం నాకు సంతోషంకూడా. అదీకాక మరో మూడు, నాలుగు సంవత్సరాల్లో నాకు ట్రాన్స్‌ఫర్ వస్తుంది. ఎక్కడికివెళ్లాల్సొస్తుందో, ఏమో. ఇప్పుడున్న చోటయితే పరిచయాలు స్నేహాలు అంతా బాగుంటుంది. అక్కడ్నుంచే కాశీ, ప్రయాగ వగైరా ప్రదేశాన్నీ చూసిరావచ్చు. నేనుండే చోటికి అవి అంతదూరం కూడా కాదు. కాబట్టి ప్రయాణం తేలిగ్గా వుంటుంది, పైగా మాపిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు

పెద్దమ్మాయికి పెళ్ళి చేయాలనుకుంటున్నాంకూడా కదా. పెద్దబాబుకు ఏ ఊళ్లో సీటువస్తే ఆ ఊరు పంపించాలి. వాళ్లు ఎవరిదారిన వాళ్లు వెళ్ళకముందే మీరు వస్తే నాకు వాళ్ళకీ కూడా సంతోషంగా వుంటుంది. నాయనమ్మ, తాతయ్య ఎప్పుడూ మనింటికి వచ్చి పది రోజులైనా వుండలేదు. అని వాళ్లు ఒకటే గోల. కనీసం పిల్లలకోసమైనా మీరు మా దగ్గరకొచ్చి వుండాల్సిందే." పెద్దకొడుకు గోపాలం తన అభిప్రాయాన్ని అనునయంగా చెప్పేడు.

"అదేం కుదర్దు. మీ అందరికీ చాలా దూరంగా వుంటున్న వాడ్ని నేను ఇంకా వయసు మీద పడ్డాక అంతంత దూరాలుప్రయా

ణం చేయడం అంటే మీ వల్ల కాదు. అప్పుడు మిమ్మల్ని కష్టపెట్ట టం. నాకూ బాగుండదు· అయినా నేను ఉద్యోగానికి వెళ్ళేప్పుడే చెప్పేను. మీరు రిటైరయ్యాక నాదగ్గరకే రావాలని. కొన్నాళ్ళయినా సరే ముందు మీరు నా దగ్గరికే వచ్చి వుండాలి. ఎప్పటికీ నాదగ్గరే వున్నా నాకేం అభ్యంతరం వుండదు. మేము వెళ్ళేప్పుడు మీరు. అమ్మ మాతో పాటు ప్రయాణం అవుతున్నారంతే" రెండో కొడుకు చిరుకోపాన్ని కలబోసి ప్రేమను ఒలకపోశాడు.

'ఇకనువ్వేమంటావ్ అన్నట్లుగా ముసి ముసి నవ్వుల్తో మూడో కొడుకువైపు క్రీగంటగా చూసిన జగన్నాథంగారు అంతలోనే భార్య ముఖంలోకి చూశారు గర్వంగా. ఆమెకూడా ఆనందాన్ని దాచుకో లేక చిరునవ్వుతో మౌనంగా వింటూ కూర్చుంది.

"మీ అందరికంటే చిన్నవాడ్ని. ఇలాంటి విషయాల్లో ఎవ రైనా చిన్నవాళ్ళకే ప్రాధాన్యత నిస్తారు. అందుకని ముందు మీరు నాదగ్గరకే రావాలి. నాదగ్గరే వుండాలి. అసలే నేనుండేది పల్లెటూరు అన్నయ్యల దగ్గరికి ముందువెళ్ళి ఆఖరుగా నాదగ్గరికొస్తే అక్కడ మీకసలు తోచదు. ఫట్టుమని పది రోజులన్నా వుండకుండా తిరుగు ప్రయాణం అవుతారు. అందుకని ముందుగా నా దగ్గరకొస్తే నాకు తృప్తిగా వుంటుంది. ముద్దుల కొడుకు ముకుందం చెప్పేడు.

"అమ్మా నాన్న ఎప్పటికయినా మీ దగ్గరికి రావలసిందేగా మీ దగ్గరికి వచ్చేముందే ఆడపిల్లల ఇద్దరి ఇళ్ళలోనూ కొంత కాలం గడిపి ఆనకనే మీలో ఎవరిదగ్గరికైనా వచ్చేది. ఎందులో నైనా లేడిస్ ఫస్ట్ కాబట్టి అమ్మా నాన్న ముందు నా దగ్గరకు తర్వాత నిర్మలదగ్గరకి వెళ్తారు" జగన్నాథంగారి పెద్దకూతురు స్వరూప మాటల్ని విని-

మామయ్య ఉద్యోగం అయిపోగానే మా దగ్గరకు రావాలని" చనువుగా అన్నది మూడో కోడలు-మేనకోడలు అయిన సునంద.

"మీరంతా మీ మీ అభిప్రాయలు చెప్పేరు. ఇక అల్లుళ్ళు ఇద్దరూ మిగిలారు. వాళ్ళు వచ్చాక వాళ్ల మాటలు ఏమిటోకూడా వినాలని ఉత్సాహంగా వుంది నాకు." అంటూ సంతోషంగా, సంతృప్తిగా నవ్వింది తులశమ్మ.

"ఈలోగా భోజనాలకి ఏర్పాట్లుచేద్దాం పదండర్రా" అంటూ వంటగదివైపు నడిచింది. జగన్నాథంగారి భార్య. ఆమెను అనుసరించారు కోడళ్ళు, కూతుళ్ళు.

అల్లుళ్ళిద్దరితో ఇంట్లో పిల్లలంతా సర్కస్ చూసేందు కెళ్ళారు. వాళ్ళు తిరిగి వచ్చే టైం కావడంతో, పిల్లలందరూ వచ్చేటప్పటికి భోజనాలు వడ్డించేందుక్కావలసిన ఏర్పాట్లు చేసేందుకుప్రక్రమించారు ఆడవారు.

కొడుకులు ముగ్గురూ ఎవరి గదుల్లోకి వాళ్ళు దూరేరు డ్రెస్‌లు మార్చుకునేందుకు. వాలుకుర్చీలో పడుకున్న జగన్నాథంగారు పిల్లలంతా తనపైన చూపుతున్న అనురాగానికీ, అప్యాయతకీ పరవశించటం ఎంత నిజమో, తనకి ఎదురైన సమస్యని పరిష్కరించుకోవటం ఎలాగో నని కలవరపడటం కూడా నిజమే.

ఆలోచనలు చుట్టుముట్టగా అన్యమనస్కంగా అలా కళ్ళు మూసుకున్నారాయన. సమస్యలు అనుభవించేందుకు ఎంతకష్టంగా విపరీతంగా వుంటాయో, వినేందుకు అంత వింతగనూ, విచిత్రంగానూ వుంటయ్. ఒక్కో సందర్భంతో ఎదుటివారి సమస్య విన్నప్పుడు అసలదికూడా ఓ సమస్యేనా అనిపిస్తుంది కూడా.

వృద్ధాప్యంలో ఆసరాగా వుండేందుకు, ఆత్మీయంగా చూసుకునేందుకు 'నా' అనే మనుష్యులు లేక. ఉన్నా పట్టించుకోకుండా ఎలా ఈ బ్రతుకు వెళ్ళిపోతుందో అని ఆక్రోశించేవారికి జగన్నాథం గారి సమస్య విచిత్రంగానే వుంటుంది మరి అలాంటి అదృష్టం తమకు కలగనందుకు అసూయ పడేవాళ్ళూ వుంటారు.

☆ ☆ ☆

ఓ పేరున్న పెద్ద ప్రైవేటు కంపెనీలో బాధ్యతగల ఉద్యోగం చేసి రిటైరయిన జగన్నాథంగారికి అయిదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు. అందరికీ పెళ్ళిళ్లు అయినై. తలా ఓ చోట స్థిరపడ్డారు. ఉన్న ఊళ్ళో సొంత ఇంట్లో ఇప్పటివరకూ హాయిగా, ఆనందంగా కాలం వెళ్ళబుచ్చిన జగన్నాథం గారికి జీవితంలో మొదటిసారిగా ఈ సమస్య ఎదురయ్యింది.

పండుగలకు, శుభకార్యాలకు పిల్లలందరూ జగన్నాథం గారి దగ్గరకే వచ్చేవాళ్లు. కొడుకుల పిల్లలకయినా కూతుళ్ళ పిల్లలకయినా నామకరణం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం లాంటి అన్ని అచ్చట్లు జగన్నాథం గారి సొంత యింట్లోనే జరిగేవి.

అన్ని వేడుకలకు అందరూ తప్పక రావాలనేది జగన్నాథం గారి తిరుగులేని నిర్ణయం. ఆయనపైనున్న అభిమానం, గౌరవంవల్లనైతేనేమి, వారికి సహజంగా వున్న అభిరుచివల్లనైతేనేమి ప్రతిసందర్భంలోనూ ప్రతిఒక్కరూ వచ్చి ఆ వేడుకలో పాల్గొనేవారు. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళూ మనుమలు, మనుమరాండ్రతో ఇల్లంతా కోలాహలంగా కళకళలాడిపోయేది.

వారంతా ఎటువాళ్ళు అటువెళ్లాక ఆలుమగలిద్దరూ ఆ మధుర క్షణాల్ని గుర్తుచేసుకుంటూ తమ పిల్లల చిన్నతనాన్ని, పసిపిల్లల ఆకతాయతనాన్ని మననం చేసుకుంటూ మురిసిపోయేవారు.

అలాంటి జగన్నాథంగారికి రిటైరయ్యాక ఎవరి దగ్గరకు వెళ్లి వుండాలన్నది ఓ పెద్ద సమస్యగా మారింది. అందరికీ ఆయనంటే అభిమానమే, ప్రేమే. ఆయనకూ పిల్లలంతా ఒక్కటే. అందరూకావాలి అందరూ కలవాలి. ఎవ్వరినీ కాదనలేరు. నొప్పించక, తానొవ్వక మసలుకోవాలనే మన స్తత్వం ఆయనది.

అదీకాక రిటైరయిపోయినంత మాత్రాన ఎవరి దగ్గర కయినా వెళ్లివుండటం ఎందుకు అనేది ఆయన అంతరంగంలోని ప్రశ్న. కానీ ఏ సమయంలో ఎవరితో ఏఅవసరం వస్తుందోనన్న కనీసపు స్వార్థం వృద్ధాప్యపు భయం ఆయన్ను తన మనసులోని మాటను నిర్భయం గా చెప్పకుండా చేసినయ్.

ఏది ఏమైనా ఈ సమస్యని సవ్యంగా పరిష్కరించడమే సము చితం అనిపించిందాయనకు. దాంతోపాటే ఆయన అభీష్టమే నెరవేరా లనే కోరికకూడా వుందాయనకు.

పిల్లలు కేరింతలు కొడుతూ గేటుతెరుచుకుని పరుగెత్తుకుంటూ వచ్చారు. వారి వెనకాలే అల్లుళ్ళు ఇద్దరూ ముచ్చట్లాడుకుంటూ వచ్చారు.

భోజనాలు తింటున్నంతసేపూ పిల్లలు చెపుతున్న సర్కస్ సంగతుల్తో నవ్వుకుంటూ గడిచిపోయింది.

కొడుకులు, అల్లుళ్ళు ధూమపానానికి సామూహికంగా డాబా

పైకి వెళ్ళారు. కోడళ్లు వంటగదిలో పని చూసుకుంటున్నారు.కూతుళ్లు ఇద్దరూ పిల్లలందరికి పక్కలు పరుస్తున్నారు.

"ఇంతకీ ఏం చెప్పాలనుకుంటున్నారు" అనునయంగా అడిగింది జగన్నాధం గార్ని భార్య భ్రమరాంబ వక్క పలుకు భర్తకందిస్తూ.

"నిన్ను అడగకుండానేనా.. ఇంతకీ నీకు ఎవరిదగ్గరవుండటం ఇష్టమో" ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగారు.

"నాకు మీ దగ్గరుండటమే ఇష్టం" అనేసి వెళ్ళిపోయింది భ్రమరాంబ.

ఆ ఒక్కమాటలో ఆమె అంతరంగాన్ని అర్ధం చేసుకున్నారు జగన్నాధంగారు. కొన్నికొన్ని సందర్భాలలో ఆడవారు చాల చాకచక్యంగా మాట్లాడేస్తుంటారు. వారి అభిప్రాయాలు బయటపెట్టవలసిన సందర్భాల్లో మరీను.

★ ★ ★

పిల్లలంతా నిద్రపోయారు.

"ఇదిగో బావగారూ, నాన్నగార్ని అమ్మని నాతోపాటు తీసుకెళ్తానంటున్నాన్నేను. కాదు నాతో రావాలంటున్నారు తమ్ముళ్లు, అక్క, చెల్లెలు. పెద్ద కొడుకుని నా ...."

"చాల్చాలు... విషయం చెప్పేవు. అంతటితో ఆపు. ఇక బావగార్ని ఆయన అభిప్రాయాన్ని చెప్పనీ" అంటూ గోపాలం మాటల్ని మధ్యలోనే ఆపేశాడు ముకుందం.

"మనందర్లోకి పెద్దవాడు పెద్ద బావగారు కాబట్టి ముందుగా

ఆయన అభిప్రాయం విందాం. తర్వాత చిన్న బావగారు చెప్తారు" నవ్వుతూ అన్నాడు జగన్నాథంగారి రెండో కొడుకు చంద్రశేఖర్.

"ఇదో పెద్దసమస్యటండి అసలు. ఈ మాత్రందానికి చర్చలు తర్కాలు, వాదోపవాదాలూను. ఏముంది దీంట్లో అ(" అంటూ అందరివంకా చూశాడు పెద్దల్లుడు.

అతనెప్పుడూ అంతే. చెప్పదలుచుకున్న విషయం సూటిగా ఎన్నడూ చెప్పడు. అతనికి సంబంధంవున్న విషయం అయితే తనకి అనుకూలంగానూ, తనకి సంబంధంలేని సంగతయితే తటస్థంగానూ సమాధానం చెప్తాడు.

"ఇదిగోబావగారూ ఉపన్యాసాలొద్దు. మాలో ఎవరిదిన్యాయం అంటారో చెప్పండి సూటిగా . అంతే" అడిగాడు ముకుందం.

"సరే అయితే చెప్పేస్తున్నాను. నేనుచెప్పాక మళ్ళీ పక్షపాతాలనీ, కక్షసాధింపులని అనకూడదు మరి" అని మళ్ళొకసారి అందరి వంక చూశాడు.

"ముందు మీరు చెప్పండి స్వామీ" అసహనంగా అన్నాడు గోపాలం.

"మీ అందర్లోకి మీ పెద్దక్క కోరిక సమంజసం,ఎందుకంటే మీ అందరికంటే ఎక్కువగా నేను మామయ్యగార్ని అభిమానిస్తాను కనుక. ఎన్నాళ్ళనుంచో నేను ఆయన్ని కొంతకాలం నాదగ్గరవుంచుకోవాలనుకుంటున్నాను కనుక. ఇంటికి పెద్దఅల్లుడ్నే అయినా నన్ను ఆయన, అత్తయ్యగారు పెద్దకొడుకు కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు. మీ పెళ్ళిళ్లు, పేరంటాలు అన్నీ నా పెత్తనంలోనే జరిగిపోయినై. సో... అందరికంటె ముందు వాళ్ళు మాదగ్గరే వుండటం సమంజసం".

కొడుకులకంటె ఎక్కువ ప్రేమ చూపుతున్న అల్లుడ్ని చూసి మహదానంద పడిపోయారు జగన్నాథం దంపతులు.

"నిన్నడగటం మా బుద్ధితక్కువలే" గొణిగాడు ముకుందం.

ఆఖరుగా చిన్నల్లుడ్నికూడా చెప్పమన్నారందరూ.

"అందరూ ఎవరికి వాళ్లే మీ మీ మనసులోని కోరిక బయట పెట్టారేకాని ఆయన మనసులో ఏముందో తెలుసుకున్నారా? ఆయన కసలు ఎవరివగ్గరకూ వచ్చి వుండటం ఇష్టం లేదేమో. ఇప్పటిలాగే ఇక్కడే వుండాలనేదే ఆయని కోరిక కావచ్చుగా. ఒకవేళ ఆయనకు అలాంటి అభిప్రాయం లేకపోయినా నా సలహామాత్రం అదే. ఆయన ఈ ఇంట్లోనే ఇలాగేవుంటుంటే మనందరం ఇలా వచ్చిపోతుండటమే బాగుంటుంది.

అసలు ఇంతమందిచేత ఇలా ప్రేమింపబడటం ఎంతటి అదృష్టమో. ఇంటా బయటా ఆయన యేర్పరచుకున్న అభిమానం, గౌరవం, ప్రేమ వెలగట్టలేనివి. ఆయనకు తృప్తినిచ్చే విధంగా చేయటం అలా వుండాలని కోరుకోవడం, వుంచేందుకు మనవంతు కర్తవ్యాన్ని మనం నిర్వహించటం మంచిది.

ఆయన రిటైరయినంత మాత్రాన తన అభీష్టానికి వ్యతిరేకంగా మరో చోటికి వెళ్లి వుండాలని ఎక్కడుంది. ఆయనకు ఎప్పుడు యే అవసరం వచ్చినా మనమే వద్దాం. అసలు ఒకరిమీద ఆధారపడి అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఆయనకు రాకూడదని కోరుకుందాం రాదని ఆశిద్దాం.

కథా నిలయం
3762
శ్రీకాకుళం

ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే ఎక్కడ మంచి వైద్యసదుపా యాలుంటాయో, ఎక్కడకు తీసుకువెళ్తే మన కందరకూ అనుకూలం గా వుంటుందో అలా చేయవచ్చు. అంతేగాని, అనవసరంగా ఆయన మనసు తెలుసుకోకుండా మనం ఎవరికి వారమే బలవంతం చేయటం ఆయన్ను ఇబ్బంది పెట్టటం నాకయితే ఇష్టంలేదు. ఇక ఆయన అభి ప్రాయం ఏమిటో మరి . " అంటూ తను చెప్పదలుచుకున్న విష యిం చెప్పేశాడు చిన్నల్లుడు సురేంద్ర.

కుర్చీలోంచిలేచి చిన్నల్లుడ్ని కౌగలించుకున్నారు జగన్నాధం గారు. ఆ చర్యతో ఆయన అభిప్రాయం అందరికీ అర్థమైంది.

'చిన్నల్లుడూ జిందాబాద్' మనసులోనే అనుకున్నారు జగ న్నాధం గారు.

కానీ "చిన్నల్లుడూ జిందాబాద్" అని తనతోపాటే తనవాళ్ళు మరికొందరు కూడా అనుకున్నట్లు తెలియదు పాపం జగన్నాధం గారికి.

(స్వాతి మాసపత్రిక)అక్టోబరు, 91